జై శ్రీమన్నారాయణ!

గీతాజ్యోతి-తెలుగు గీతలు
(25-34 శ్లోకాలు)
తెలుగు పద్యాలు(తేటగీతలు) రాసినది:
కీ. శే. శ్రీమాన్ అద్దంకి శ్రీరంగాచార్యులు

9. 30 (25)
మహాపాపినైనా మహాత్ముణ్ణి చేస్తాడు మాధవుడు.

అపిచేత్ సుదురాచారో భజతే మా మనన్యభాక్ |
సాధురేవ స మంతవ్యః సమ్యగ్ వ్యవసితో హి సః ||

మంచి సంకల్ప ముదయింప మనసునందు
పరమ దుర్మార్గుడగుగాక బట్టుపిడక
నన్ను మనసార భజియింప దెన్నుగసిన
నట్టివానిని సాధువే యనుట తగును.

9.31 (26)
భక్తుని బాసకు భగవానుడు బద్ధుడు

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతి నిగచ్ఛతి |
కౌంతేయ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ||

మంచి మార్గాన వేగమే మలుపుతిరిగి
నిత్యశాంతిని నాతడు నెరపగలడు
పతనమందు నాదగు భక్తుడెపుడు
పారుపోదయ్య నామాట పార్థ వినుమ.

10.10 (27)
శ్రీకృష్ణుని ప్రేమకు అవధుల్లేవు.

తేషాం సతత యుక్తానాం భజతాం, ప్రీతి పూర్వకం |
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే||

భక్తితో నన్ను నిరతము భజనజేసి
చిత్తమందు న మూర్తిని హత్తుకొనిన
బుద్ధియోగమునందున సిద్ధినిత్తు
జేరుకొందురు తుదకు నన్ వారు పార్ధ.

---

10.20 (28)
ప్రాణులందరికీ ప్రభువు,
ప్రాణమూ పుండరీకాక్షుడే.

అహమాత్మా గుడాకేశ! సర్వ భూతాశయ స్థితః |
అహమాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ||

అన్నియాత్మల వసియించు నాత్మశక్తి
సకల జీవులందు మెలగు చలనశక్తి
నేనె యాదిని మధ్యయు నేనె, నేనె
యంతమును పార్ధ అన్ని నాయందుడిందు.

---

11.8 (29)
దంభం దూరమైతే దివ్య దృష్టి దక్కుతుంది.

న తు మాం శక్య సే ద్రష్టుం అనేనైవ స్వచక్షుషా |
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ||

కనులు మిరుమిట్లు గొలుపు నా కాంతినీవు
చూడలేవు నీకండ్లతో సూటిగాను
దివ్యచక్షువు లొసగుదు తేరిచూడు
నాదు యోగపిభూతిని సాధుచరిత.

---

11.47 (30)
స్వంత సాధనలకు స్వామి దొరకడు-
కృష్ణుడిస్తే కనవలసిందే.

మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శిత మాత్మయోగాత్ |
తేజోమయం విశ్వమనంత మాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వం||

యొగమహిమనే గరుణతో యోగ్యమైన
పరమభక్తుడవని నీవు పార్థ! నీకు
చూపినాను నాదగు విశ్వరూపమిపుడు
ఎట్టివారికి జూపలే దిట్టిదాని
ఎన్నడైనన్ను పూర్వము తిన్నగాను
నేను తేజోమయుడనయ్య నేను విశ్వ
భవుడునంతు డనాదిని పార్థ వినుమ.

11. 55 (31)
వృత్తి, ప్రవృత్తి పరమాత్మ పరమైతే,
పనులన్నీ పరమాత్మసేవలే అవుతాయి.

మత్కర్మకృన్మత్పరమో! మద్భక్త స్సంగవర్జితః|
నిర్వైర స్సర్వభూతేషు య స్స మామేతి పాండవ! ||

పరమ లక్ష్యమ్ముగా నాదు పదములంటి
బంధముల ద్రుంచి ఓ పార్థ పట్టువిడక
ఎట్టివారల ద్వేషింప నట్టివారు
భక్తితో నన్ను గొలువనే బట్టువడుదు.

12.8 (32)
మనస్సుని మాధవుని మందిరముగా
మలచడమే మోక్షము.

మయ్యేవ మన ఆధత్స్వ మయి భుద్ధిం నివేశయ|
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ||

మనసు నామీద నిలుపుచు మసలు కొనిన
బుద్ధి నాలోన జొనిపించి సిద్ధిగనిన
నీవు నాలో వసింతువు నిక్కువముగ
నిశ్చయంబుగ జెప్పద నీకు నేను.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు.
30 వ సెప్టెంబర్ 2005